
సాక్షి
కుమురం భీం
బుధవారం, 19, జూలై, 2023



ఏళ్లుగా ఎదురుచూపులు
జిల్లాలో 55 పంచాయతీలు ఏకగ్రీవం కాగా నేటికీ ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు విడుదల చేయలేదు. మాటిచ్చి మరిచిన సర్కార్‌పై పాలకవర్గాలు మండిపడుతున్నాయి. 9లో▸



ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా
సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కోనప్ప క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. కుటుంబీకులకు వినతిపత్రం ఇచ్చారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.0 /24.0

పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లా అంతటా ముసురు పడనుంది. పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం
కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. చరిత్ర-2, ఆంగ్లం-3, తెలుగు-2, కంప్యూటర్ సైన్స్-2, రాజనీతి శాస్త్రం-2, కామర్స్-2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈనెల 21లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత విభాగంలో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7013607011 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి తొలిమెట్టు శిక్షణ
ఆసిఫాబాద్‌రూరల్: నేటి నుంచి నాలుగు రోజుల పాటు తొలిమెట్టుపై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 19 నుంచి 22వ తేదీ వరకు తొలిమెట్టుపై ప్రతీ మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయు (రిసోర్స్ పర్సన్)లకు 'విద్యార్థులకు సులువు చదవడం.. రాయడం.. ఎలా నేర్పించాలి' అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలం నుంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మిగతావారికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకునేలా అభ్యాస పుస్తకాలు, పాఠశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచాలి
కౌటాల: వసతి గృహాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. మంగళవారం కౌటాల కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. వర్షపు నీరు పాఠశాల ఆవరణలోనే నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు తెలుపగా రెండు రోజుల్లో సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్వో పవిత్రకు సూచించారు.

కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో టిఫిన్ బైఠక్
ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సొల్లు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక సద్ది భోజనం ఆరగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాం నాయక్, కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడు చక్రపాణి, నాయకులు ఆంజనేయులుగౌడ్, బాలకృష్ణ, తిరుపతి, వందన, సుధాకర్, విజయ్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మనబడి' పనుల పరిశీలన
కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామంలోగల జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలల్లో చేపట్టిన 'మన ఊరు-మనబడి' పనులను మంగళవారం సర్వశిక్షా అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పరిశీలించారు. బోధన తీరు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ తదితర వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో భిక్షపతి, జిల్లా విద్యాశాఖ ఎస్వో భరత్, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పర్వతి రాజేశ్వర్, విజయలక్ష్మి, కమాలొద్దీన్, సీఆర్పీ అర్జున్ పాల్గొన్నారు.

నులిపురుగును నిర్మూలించాలి
ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 20న జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని వైద్యాధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రామకృష్ణ ఓ ప్రకటనలో సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల్లో 1-19 ఏళ్లలోపు వారికి 200ఎంజీ అల్బెండజోల్ మాత్రలు వినియోగించాలని తెలిపారు. 1-2 ఏళ్లలోపు వారికి 200 ఎంజీ రెండు స్పూన్ల చూర్ణం చేసి వేయాలని, 2-3 ఏళ్లలోపు వారికి 400 ఎంజీ, 3-19 ఏళ్లలోపు వారికి 400 ఎంజీ పూర్తి ట్యాబ్‌లెట్‌ను సరిగ్గా నమిలించాలని పేర్కొన్నారు. ట్యాబ్‌లెట్లను ఇండ్లకు ఇవ్వకూడదని, భోజనం తర్వాత ట్యాబ్‌లెట్ వాడాలని సూచించారు. జూలై 19న పాఠశాలలు, కళాశాలల్లో బ్లాక్‌బోర్డులపై 'ఎన్డీడీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం' అని రాయించాలని తెలిపారు.



ఎలమంద

ఎప్పుడొచ్చేనో..!

- గొల్లకుర్మల ఎదురుచూపు
- డీడీలు చెల్లించినా నిరీక్షణే
- ఆగిన రెండోవిడత పంపిణీ
- ఆందోళనలో లబ్ధిదారులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రభుత్వం గొల్లకుర్మలకు 75శాతం రాయితీపై అందజేసే గొర్రెల పంపిణీ ప్రక్రియలో తీవ్రజాప్యం జరుగుతోంది. లబ్ధిదారులు డీడీలు చెల్లించి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా ఫలితం లేదు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టగా గొల్ల కుర్మలకిచ్చే సబ్సిడీ గొర్రెల యూనిట్ల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేస్తోంది. 18 ఏళ్లు నిండి గొర్రెల పెంపకంపై అవగాహన కలిగి ఉండడంతోపాటు గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న గొల్లకుర్మలను ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల యూనిట్లకు అర్హులుగా గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా మొదటివిడత గొర్రెల పంపిణీ పూర్తయింది. కానీ.. రెండో విడత పంపిణీ ఊసేలేదు. తమ వాటా డీడీ రూపంలో చెల్లించిన లబ్ధిదారులు గొర్రెలు వస్తాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరగా గొర్రెల పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జిల్లాలో లబ్ధిదారులు, డీడీలు చెల్లించిన వారి వివరాలు

మండలం	లబ్ధిదారులు	డీడీలు చెల్లించినవారు	పంపిణీ చేసిన యూనిట్లు
ఆసిఫాబాద్	392	99	7
బెజ్జూర్	120	95	24
చింతలమానెపల్లి	71	37	00
దహెగాం	54	20	00
జైనూర్	16	00	00
కాగజ్‌నగర్	233	90	00
కెరమెరి	12	07	06
కౌటాల	102	72	00
లింగాపూర్	29	20	00
పెంచికల్‌పేట్	23	02	00
రెబ్బెన	140	20	00
సిర్పూర్(యూ)	12	12	00
సిర్పూర్(టి)	129	62	18
తిర్యాణి	73	00	00
వాంకిడి	104	01	00
మొత్తం	1,510	537	48

జిల్లాలో పథకం వివరాలు ఇలా..

పథకానికి అర్హులైవారు: **1,510** మంది

డీడీలు చెల్లించినవారు: **537** మంది

మొదటి విడతలో పంపిణీ చేసిన యూనిట్లు: **48**

రెండోవిడత పంపిణీ కావాల్సినవి: **1,462**

డీడీలు కట్టి పది నెలలైంది



గొర్రెల కోసం పది నెలల కింద రూ.43,750 డీడీ చెల్లించిన. డీడీలు చెల్లించి నోళ్లకు తొందరగా గొర్రెలు వస్తయని అధికారులు చెప్పిన్రు. పది నెలలైనా ఇప్పటివరకు గొర్రెలు పంపిణీ చేస్తలేరు. ఇప్పటికైగొర్రెలియ్యాలె. లేదా డీడీ డబ్బులు వాపసియ్యాలె.

– సాగర్, బురుగుడ

అధికారుల చుట్టే తిరుగుతున్నా..



ప్రభుత్వం గొల్లకుర్మలకు ఇచ్చే గొర్రెల కోసం ఏడు నెలల క్రితం డీడీలు కట్టినం. ప్రభుత్వం ఇప్పుడు.. అప్పుడంటూ కాలం వెల్లదీస్తోంది. కానీ.. గొర్రెలు మాత్రం ఇయ్యడంలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదు. డీడీలు కట్టిన మాకు వెంటనే గొర్రెలియ్యాలె.

– కిషన్, ఎల్లాపటార్, లింగాపూర్

ఉత్తర్వులు అందలేదు
రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత గొర్రెల పంపిణీకి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు విడుదల చేయలేదు. త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టే అవకాశముంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే గొర్రెలు పంపిణీ చేస్తాం. పంపిణీలో శాఖాపరంగా ఎలాంటి జాప్యం లేదు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సురేశ్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశం, డీఆర్వో రాజేశ్వర్‌తో కలిసి ఫొటో ఓటరు జాబితా రూపకల్పనపై డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏఎల్ఎంటీ, డీఎల్ఎంటి శిక్షణ పొందిన వారు బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చే సమయంలో ఓటరు జాబితా రూపకల్పన, ఓటు విలువ తెలియజేయాలని తెలిపారు. రెండో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతున్నందున అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా తయారు చేయడంలో బూత్ స్థాయి అధికారుల పాత్ర కీలకమైందని, వారికి శిక్షణ ఇచ్చే సమయంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఏఎల్ఎంటీలు, డీఎల్ఎంటీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



హాజరైన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ రాజేశం సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి సురేందర్‌తో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్య నిర్వహణ, హరితహారం, అంటువ్యాధుల నియంత్రణ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. మురుగుకాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలని, రోడ్లు, నివాస ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా దోమల మందు పిచికారీ చేయాలని తెలిపారు. మంచినీటి బావులు, ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయాలని సూచించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది ఎస్సైల బదిలీ
కౌటాల: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలుగా పని చేస్తున్న ఎనిమిది మందికి మంగళవారం స్థానచలనం కల్పించారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.వెంకటేశ్	కెరమెరి	చింతలమానెపల్లి
ఎస్.మధుకర్	జైనూర్	కౌటాల
ఎస్.వెంకటేశ్	బెజ్జూర్	ఎస్పీ ఆసిఫాబాద్
బీ రామన్‌కుమార్	ఎస్పీ ఆసిఫాబాద్	ఈజ్‌గాం
బీ విక్రమ్	దహెగాం	బెజ్జూర్
ఎస్.సందీప్	ఎస్పీ ఆసిఫాబాద్	జైనూర్
జీ విజయ్	చింతలమానెపల్లి	కెరమెరి
ఏ కొమురయ్య	ఆసిఫాబాద్	పెంచికల్‌పేట్



పౌరసరఫరాలశాఖలో బదిలీలు



ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మంచిర్యాల జిల్లా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో పని చేస్తున్న సహాయ పౌరసరఫరాల శాఖ అధికారు(ఏసీఎస్‌వో)లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో మల్టీ జోనల్ పోస్టులు ఉన్న ఏసీఎస్‌వోలను కొత్త స్థానికత ప్రకారం ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. పలు జిల్లాల్లో ఏసీఎస్‌వోలే డీసీఎస్‌వోలుగా వివిధ ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై ఎఫ్ఏసీలుగా కొనసాగుతున్నారు. మంచిర్యాల(ఎఫ్ఏసీ)(ఒరిజనల్ పోస్టు మేడ్చల్) డీసీఎస్‌వో ఏ.ప్రేమ్‌కుమార్‌ను పెద్దపల్లి జిల్లాకు, ఆదిలాబాద్ జిల్లా పని చేస్తున్న ఆర్ సుదర్శనంను వనపర్తికి, అలాగే వి.బాలరాజును మేడ్చల్ మల్కాజ్‌గిరికి బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లాలో రెగ్యులర్ పోస్టులో ఉన్న ఎం.శ్రీనివాస్‌రెడ్డిని భువనగిరికి, వనపర్తి జిల్లా నుంచి జి.బాబా వినోద్ కుమార్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, నిర్మల్ జిల్లాకు హైదరాబాద్‌లో పని చేస్తున్న షేక్ మహ్మద్ అలీని నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పరీక్ష ఫీజు చెల్లించాలి
కాగజ్‌నగర్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో డిగ్రీలో ఫెయిలైన విద్యార్థులకు యూనివర్సిటీ మరోసారి ఫీజు చెల్లించి పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకే యూనివర్సిటీ నుంచి అనుమతి పొందిన విద్యార్థులు ఈనెల 22వ తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 28 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

తెరిపినివ్వని ముసురు

- పొంగిపొర్లుతున్న వాగులు, ఒర్రెలు
- పలుచోట్ల స్తంభించిన జనజీవనం
- 'కొమురంభీం' ఐదో గేటు ఎత్తివేత



ఆసిఫాబాద్: గుండి వాగు మీదుగా నాటుపడవలో ప్రమాదకరంగా దాటుతున్న ప్రజలు



ఆసిఫాబాద్: మండలం గుండి వాగులో పెరిగిన నీటి ప్రవాహం

ఆసిఫాబాద్/చింతలమానెపల్లి/కౌటాల: ఎడతెరిపిలేని వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. సోమవారం నుంచి కురుస్తున్న వానకు జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు కారణంగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లాలోని వాగులు, ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువన కురిసిన వర్షానికి జిల్లాలోని ప్రాజెక్టుల్లో వరదనీరు చేరింది. జలాశయాలు, చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో నీటి ప్రవాహం పెరిగింది.

కొమురంభీం గేటు ఎత్తివేత

ఎగువన కురుస్తున్న వర్షంతో ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగుకు వరద పోటెత్తింది. దీంతో జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు నాటు పడవల్లో ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు. జిల్లాలోని కొమురంభీమ్, వట్టివాగు ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరింది. ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అధికారులు కొమురంభీమ్ ప్రాజెక్ట్ ఐదో గేటు ఎత్తివేశారు. ఇన్‌ఫ్లో 208 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 208 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్ట్ గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా, మంగళవారం 237.400 మీటర్లకు చేరింది. అలాగే వట్టివాగు ప్రాజెక్ట్ గరిష్ట నీటి మట్టం 239.500 మీటర్లు కాగా, 235.200 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 360 క్యూసెక్కులు ఉండగా, కాల్వల ద్వారా 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షంతో జిల్లాలో మంగళవారం 34.3 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా దహెగాంలో 63.2 మిల్లీ మీటర్లుగా నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణ వర్షం 364.6 మిల్లీ మీటర్లు కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 333.1 మిల్లీ మీటర్లు నమోదైంది. గతేడాది ఇదే సమయానికి 960.8 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాబోయే రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ఆయా మండలాల్లో పర్యటించిన అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ)
జైనూర్	17.2
సిర్పూర్(యూ)	13.6
తిర్యాణి	24.8
రెబ్బెన	41.2
ఆసిఫాబాద్	19.4
కెరమెరి	13.8
వాంకిడి	21.2
కాగజ్‌నగర్	32.0
సిర్పూర్(టీ)	40.2
కౌటాల	46.4
బెజ్జూర్	49.0
దహెగాం	63.2
లింగాపూర్	18.8
చింతలమానెపల్లి	58.2
పెంచికల్‌పేట్	56.4

ఆడ ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత
ఆసిఫాబాద్‌రూరల్: సోమవారం నుంచి కురుస్తున్న వర్షానికి ఎగువ నుంచి వస్తున్న వరద కొమురంభీం (ఆడ) ప్రాజెక్ట్‌లో చేరడంతో మంగళవారం ఒక గేటు ఎత్తి దిగువకు 208 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 5.629 టీఎంసీలు కాగా, 375.1 మిల్లీ మీటర్ల నీరు చేరినట్లు పేర్కొన్నారు.

తీగల ఒర్రెను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే
బెజ్జూర్: మండలంలోని సలుగుపెల్లి నుంచి పెంచికల్‌పేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై తీగల ఒర్రె ప్రాంతంలో నిర్మిస్తున్న బ్రిడ్జితో పాటు బెజ్జూర్ ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలను మంగళవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రెండు, మూడ్రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని, తీగల ఒర్రె వరద ప్రవాహం తక్కువైన తర్వాత వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా తగినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్‌ఖాన్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కొండ్ర నరేందర్‌గౌడ్, వార్డు సభ్యుడు షౌకత్ అలీఖాన్, నాయకులు ముడిమడుగుల పెంటన్న, అజీమ్‌ఖాన్, మంజూర్, మల్లేశ్ తదితరులున్నారు.



ఒర్రెను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పెద్దవాగు అప్రోచ్ రోడ్డు పరిశీలన
పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్-దహెగాం మండలాల మధ్య పెద్దవాగుపై చేపట్టిన వంతెన, అప్రోచ్ రోడ్డు పనులను కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెద్దవాగుకు వరద పోటెత్తే అవకాశం ఉన్నందున అప్రోచ్ రోడ్డు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లగ్గాం ఎక్స్‌రోడ్డు నుంచి పెంచికల్‌పేట్ వరకు రోడ్డు మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పెద్దవాగులో క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట పీఆర్ ఈఈ రామ్మోహన్ తదితరులున్నారు.

క్లుప్తంగా

వరకట్న వేధింపుల కేసులో నలుగురి రిమాండ్

వాంకిడి: మండలంలోని తేజిగూడ గ్రామానికి చెందిన వివాహిత అంజలి సోమవారం వరకట్న వేధింపులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అంజలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి భర్త, అత్త, మామ, మరిదిని అదుపులోకి తీసుకుని బుధవారం కోర్టులో హాజరుపర్చారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

పోడు పట్టాలు ఇప్పించండి



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

వేమనపల్లి: ఏళ్ల తరబడి సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని నీల్వాయి గ్రామానికి చెందిన గిరిజనులు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు స్వర్ణలత, సంతోష్, సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పేయ్‌కు వినతిపత్రం అందజేశారు. తాము సాగు చేసుకుంటున్న భూముల్లోకి అటవీ అధికారులు వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని విన్నవించారు. పోడు పట్టాలు ఇప్పించి అటవీ అధికారుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. నాయకులు పన్నం చందు, మధుసూదన్, 150 మంది గిరిజన కుటుంబాలు పాల్గొన్నాయి.

20న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పరిసర ప్రాంతాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గూగుల్‌పే కంపెనీలో 30 ఫీల్డ్ సేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాల కోసం ఇంటర్ ఆపై విద్యార్హతలు కలిగి ఉండాలని, 18నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పురుష అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

శ్రీరాంపూర్: ఇందారం ఓపెన్ కాస్ట్‌లో పని చేస్తున్న బి.సతీష్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శ్రీరాంపూర్ పోలీసులు అప్పగించారు. శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ ఈ నెల 14న శ్రీరాంపూర్‌లో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాల నమోదు చేసి ఆచూకీ కనుగొన్నారు. రూ.26వేల విలువైన ఫోన్‌ను మంగళవారం బాధితుడికి అప్పగించారు.

చెత్తపై కార్యదర్శి చిత్తశుద్ధి



చెత్తను సేకరిస్తున్న కార్యదర్శి సాగర్

నెన్నెల: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు 13 రోజులుగా సమ్మె చేస్తున్నారు. గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో నెన్నెల పంచాయతీ కార్యదర్శి సాగర్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికి వెళ్లి మంగళవారం చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గ్రామంలో పారిశుధ్య పనులకు ఆటంకం కలుగకుండా డ్రైవర్ లేని లోటు తీర్చి శభాష్ అనిపించుకున్నాడు. వీధులు, ఇళ్లలో చెత్త నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతారనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్యదర్శి వివరించారు.

'పంచాయతీ ఉద్యోగులపై వివక్ష విడనాడాలి'



ర్యాలీలో గ్రామ పంచాయతీ కార్మికులు

పాతమంచిర్యాల: గ్రామ పంచాయతీ వర్కర్లు, ఉద్యోగులపై ప్రభుత్వం వివక్ష వీడనాడాలని గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటికి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ ఉద్యోగుల జేఏసీ నాయకులను చర్చలకు పిలవాలని అన్నారు. కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు, బిల్‌కలెక్టర్లు, కారోబార్లు పాల్గొన్నారు.

అటవీశాఖలో అధికారుల ఖాళీలు

- దీర్ఘకాలిక సెలవులో ఎఫ్‌డీవో
- జన్నారం రేంజ్ అధికారీ అదే బాట



ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయం

జన్నారం: ప్రతీరోజు 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ అటవీ రక్షణ చేసే సిబ్బందిని పర్యవేక్షించే అధికారులు సెలవులపై వెళ్లడంతో టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో క్రమశిక్షణ తప్పుతోంది. వర్షాకాలం సీజన్‌లో మొక్కలు నాటడం, వన్యప్రాణుల రక్షణలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ డివిజనల్ ఫారెస్ట్ అధికారి, జన్నారం రేంజ్ అధికారులతోపాటు మరో 15 మంది బీట్ అధికారులు సెలవులో ఉండడంతో పనులు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఖాళీలు స్మగ్లర్లు, వారికి సహకరించే అధికారులకు వరంగా మారుతోంది.

అనువైన డివిజన్ జన్నారం

కవ్వాల్ టైగర్‌జోన్ తక్కువ విస్తీర్ణంలో ఉన్నా పులుల ఆవాసానికి అనువుగా ఉంటుంది. దట్టమైన అడవులు, వెదురు పొదలతోపాటు గడ్డి క్షేత్రాలతో వన్యప్రాణుల సంఖ్య కూడా పెరిగింది. జన్నారం అటవీ డివిజన్‌లో ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ రేంజ్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14 అటవీ సెక్షన్‌లు, 40 బీట్‌లు ఉన్నాయి. వీరి పనితీరును డివిజన్ అధికారి పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పనులు చేస్తుంటారు. కానీ ఎఫ్‌డీవో, రేంజ్ అధికారులు సెలవులపై వెళ్లడంతో డివిజన్‌లో క్రమశిక్షణ తప్పుతోంది. నాలుగేళ్లు సుదీర్ఘంగా పని చేసి, ఉన్నతాధికారుల సహాయంతో డివిజన్‌ను క్రమశిక్షణ మార్గంలో నడిపిన ఎఫ్‌డీఓ మాధవరావు ఈ నెల 3 నుంచి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో ఇన్‌చార్జి బాధ్యతలు మంచిర్యాల జిల్లా అటవీ సంరక్షణ అధికారి శివ్ ఆశీష్ సింగ్ చేపట్టారు. నిత్యం ప్రభుత్వ, ఉన్నత అధికారుల సమావేశాలు, జిల్లాస్థాయి పనులతో డీఎఫ్‌వో బిజీగా ఉండడంతో డివిజన్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. జన్నారం డివిజన్ కేంద్రంలోని జన్నారం రేంజ్ అధికారిగా గత నెల రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ కూడా పది రోజుల క్రితం సెలవుపై వెళ్లారు. దీంతో సిబ్బంది పనితీరు గమనించేవారు కరువయ్యారు. జన్నారం రేంజ్ అధికారి మరో పది రోజులు సెలవును పొడిగించుకున్నట్లు తెలిసింది. వీరితోపాటు జన్నారం డివిజన్‌లో 40 మంది బీట్ అధికారులు ఉండాల్సి ఉండగా అందులో 15 మంది లేకపోవడంతో ఇక్కడే పని చేస్తున్న మరో బీట్ అధికారి, సెక్షన్ అధికారులకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చారు. విధుల్లో నియామకమైనా కొన్ని రోజులకే పని చేయలేక వెళ్లిపోవడంతో బీట్ అధికారులు ఖాళీ అయ్యారు.

వన్యప్రాణులకు ఇబ్బంది

జన్నారం అటవీ డివిజన్‌లో గత మూడేళ్లుగా చుక్కల దుప్పులు, నీలుగాయి, సాంబర్లు, అడవి పందులు, అడవి దున్నలు, కొండగొర్రెలు వంటి వన్యప్రాణుల సంఖ్య పెరిగినట్లు అటవీ అధికారులు తెలిపారు. వర్షకాలంలో దట్టమైన చెట్లపొదల మాటున వేటగాళ్లు వేటాడే అవకాశం ఉంది. నిత్యం నిఘా పెట్టి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ సమయంలో పర్యవేక్షించే అధికారులు లేకపోతే ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది.

నాలుగేళ్లుగా ఒకరే..

జన్నారం అటవీ డివిజన్‌లో ఇప్పటివరకు ఇద్దరే నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేశారు. 1985లో డివిజనల్ ఫారెస్ట్ అధికారి నాగనాథ్ నాలుగేళ్లు పని చేశారు. 2019లో విధుల్లో ఎఫ్‌డీవోగా చేరిన సిరిపురం మాధవరావు నాలుగేళ్ల మూడు నెలల కాలం పూర్తి చేసుకున్నారు. ఏ అధికారికైనా రెండేళ్ల తర్వాత సాధారణంగా బదిలీ జరుగుతుంది. కానీ నాలుగేళ్లు దాటినా బదిలీ విషయంలో ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో ఆయన దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది.

స్మగ్లింగ్ పెరిగే అవకాశం

అధికారుల పర్యవేక్షణ లేకపోతే డివిజన్‌లో స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉంది. గత మూడేళ్లుగా తగ్గిన స్మగ్లింగ్ తిరిగి పెరుగుతోంది. ఈ నెల 3న ట్రాక్టర్‌లో తరలిస్తున్న రూ.1.20 లక్షల విలువైన కలప, ఈ నెల 7న కవ్వాల్ హాస్టల్‌తండా నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న రూ.70 వేల విలువైన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. నిత్యం అడవిలో పర్యవేక్షణ చేస్తే తప్ప స్మగ్లింగ్ నిరోధం సాధ్యం కాదు. గడ్డంగూడ సమీపంలోని అటవీ పోడు భూమిలో గుడిసెలు వేసుకుని వారం రోజులు గడుస్తున్నా అటవీశాఖ అధికారులు దృష్టి సారించలేదు. కవ్వాల్ అటవీ సెక్షన్ పరిధిలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ గిరిజనులు అడవిని చదును చేసి గుడిసెలు వేసుకున్నారు. ఎఫ్‌డీవో, జన్నారం రేంజ్ అధికారి సెలవులో ఉండడంతో స్పందించే వారు కరువయ్యారు. ఇన్‌చార్జి అధికారి, జిల్లా అటవీ సంరక్షణ అధికారి నిత్యం తన విధుల్లో బిజీ కావడంతో డివిజన్ విషయంలో ఎక్కువ దృష్టి సారించలేకపోతున్నట్లు తెలుస్తోంది. జిల్లా అటవీ సంరక్షణ అధికారి శివ్ ఆశీష్ సింగ్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులో లేరు.

ఏరియాలో లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పర్యటన



జీఎం దేవేందర్‌తో చర్చిస్తున్న అధికారి శంకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం రామగుండం లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.శంకర్ పర్యటించారు. గోలేటిలోని జీఎం కార్యాలయాన్ని సందర్శించారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల రికార్డులు, సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దేవేందర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఇసుక డంప్ స్వాధీనం



ఇసుక డంపులను పరిశీలిస్తున్న ఆర్‌ఐ నితిన్

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ శివారులో పెనుగంగా నది తీరాన నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్‌ఐ నితిన్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. వీటిని లెక్కించి మొత్తం 1,085 ట్రాక్టర్ల ఇసుక కుప్పలు, 250 టిప్పర్ల ఇసుక కుప్పలు సీజ్ చేసినట్లు తెలిపారు.

చేపల వలలో చిక్కుకుని మత్స్యకారుడి మృతి



కంకణాల భూమయ్య(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట తెలుగువాడకు చెందిన మత్స్యకారుడు కంకణాల భూమయ్య(62) చేపల వలలో చిక్కుకుని మృతిచెందాడు. భూమయ్య కుటుంబం చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తోంది. సోమవారం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో చేపల వలలు కట్టి వచ్చాడు. మంగళవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో వలకు పడిన చేపలను తీసుకుని వచ్చేందుకు వెళ్లాడు. చేపలు తీసేందుకు వెళ్లిన భూమయ్య ఒక్కసారిగా తెప్పపై నుంచి అదుపుతప్పి నీట మునిగిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చేపల వలలోనే చిక్కుకుని మృతిచెందాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు, ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా అందరికీ వివాహాలు అయ్యాయి. మృతుడి కుమారుడు కంకణాల రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికులపై కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అనేక హక్కులు, వరాలు అందిస్తున్నారని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్మికుల మీద ఉన్న ప్రేమతో కేసీఆర్ అనేక వరాలు ప్రకటించారని తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా దాదాపు 15వేల మంది కార్మికుల వారసులు సంస్థలో ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. కార్మికులకు రూ.10లక్షల గృహరుణంపై వడ్డీని యాజమాన్యమే చెల్లిస్తోందన్నారు. కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే కరెంట్ బిల్లు మాఫీ, ఉచిత ఏసీ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కోల్ ఇండియాలో లేని ఎన్నో హక్కులు కేసీఆర్ మూలంగానే సింగరేణి కార్మికులకు అందాయని తెలిపారు. సింగరేణిలో ఉత్పత్తి, టర్నోవర్ పెరిగి అత్యధిక లాభాలు రావడంతో కార్మికులకు లాభాల వాటాను కూడా పెంచారని పేర్కొన్నారు. ఈ ఏడాది సింగరేణి రూ.700 కోట్ల లాభాలను కార్మికులకు పంచబోతోందని తెలిపారు. ఎప్పటిలాగే దసరాకు ముందే కార్మికులకు లాభాల వాటా ఇప్పిస్తామని పేర్కొన్నారు. మస్టర్లు నిండిన ప్రతీ బదిలీ వర్కర్ కార్మికులను నెల రోజుల్లోనే జనరల్ మజ్దూర్ ఇప్పిస్తామని చెప్పారని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, 11 మన్ కమిటీ సభ్యుడు మంగీలాల్, సెంట్రల్ కమిటీ నాయకులు రాయలింగు, వెంకటరమణ, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశం, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల..!



కళాశాల మెట్లపై తాగి పడేసిన బీర్ బాటిళ్లు



కళాశాల వరండాలో బీర్ బాటిల్, రాళ్లు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మందుబాబులకు అడ్డాగా మారింది. మందుబాబులు రాత్రనకా, పగలనకా కళాశాల వెనుకల ఉన్న మెట్ల మీద కూర్చుని, మద్యం తాగుతూ ఖాళీ సీసాలను ఎక్కడ పడితే అక్కడే పడేయడం, పగలగొట్టడం చేస్తున్నారు. ఈ నెల16న(ఆదివారం) కొందరు వ్యక్తులు మెట్ల మీద మద్యం సేవిస్తుంటే, గమనించిన కళాశాల సిబ్బంది మందలించే ప్రయత్నం చేయగా, అక్కడి నుంచి పారిపోయారు. మంగళవారం ఉదయం కళాశాల తాళం తెరిచి చూడగా, బీర్ బాటిల్ కళాశాల కారిడార్‌లో పడేసి ఉంది. పైగా బండరాళ్లను కారిడార్‌లోకి విసిరి హంగామా సృష్టించారు. రోజురోజుకూ మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని, పోలీసులు కళాశాల మైదానంపై ప్రత్యేక దృష్టి సారించాలని కళాశాల యాజమాన్యం కోరుతోంది.

పాఠాలు సాగేదెలా..!?

- కళాశాలలకు చేరని పాఠ్యపుస్తకాలు
- గెస్ట్‌లెక్చరర్ల నియామకంలో గందరగోళం



మంచిర్యాల కళాశాలలో విద్యార్థులు(ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండడంతో బోధన సాగకుండా పోతోంది. జనరల్, వృత్తి విద్య విభాగాల్లో సరిపడా అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ఏడాది గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసిన వారికి రెన్యూవల్‌పై గందరగోళం నెలకొంది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర దాటిపోతున్నా పుస్తకాలు సరఫరా కాకపోవడంతో చదువులపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల జిల్లాలో 10, నిర్మల్‌లో 12, కుమురంభీంలో 11, ఆదిలాబాద్‌లో 13 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. దాదాపు 30వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. చాలా కళాశాలల్లో విద్యార్థుల నుంచి పాత పుస్తకాలు తీసుకుని వాటితో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత సంవత్సరం కొన్ని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుని మధ్యలో ఐటీఐ, పాలిటెక్నిక్ వైపు వెళ్లి వారి పుస్తకాలు అలాగే ఉండిపోయాయి. అలాంటి చోట ఈ ఏడాది విద్యార్థులకు అందిస్తున్నారు. రెండో సంవత్సరం విద్యార్థుల నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు సర్దుబాటు చేస్తున్నా ఇంకా పాఠ్యపుస్తకాల సమస్య తీరడం లేదు.

సగం సీట్లు నిండని పరిస్థితి

మంచిర్యాల జిల్లాలోని ఓ కళాశాలలో గతేడాది 490 అడ్మిషన్లు కాగా ఈ ఏడాది 260 ప్రవేశాల సంఖ్య దాటలేదు. మరో కళాశాలలో ఆరు గ్రూపుల్లో 100 మంది చేరని పరిస్థితి. ఈ నెల 25తో అడ్మిషన్ల గడువు ముగియనుంది. మళ్లీ కళాశాలల ప్రవేశాల కోసం గడువు పెంచుతారనే ఆశలు పెట్టుకున్నారు. సీట్లు నిండకపోవడానికి వసతితో కూడిన కళాశాలల ఏర్పాటు కారణమని చెబుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకం ఇలా..

2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఒప్పంద అధ్యాపకుల నియామకాలు నిలిపివేసింది. ఉద్యోగ విరమణ పొందిన వారి పోస్టుల్లో విశ్రాంత అధ్యాపకులు, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను అతిథి అధ్యాపకులుగా నియమించింది. అప్పట్లో నెలకు రూ.10వేలు వేతనం ఉండడంతో బోధనకు విముఖత చూపారు. అర్హత కలిగిన అభ్యర్థులను తీసుకోవాలని భావించి పీరియడ్‌కు రూ.150 చొప్పున కనీస వేతనం రూ.21వేలకు మించకుండా నిర్ణయించింది. గతేడాది ప్రభుత్వం పీరియడ్‌కు రూ.390 పెంచి నెలకు రూ.28వేలు మించనివ్వలేదు. ఇలా ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేస్తున్నారు. ఈ ఏడాది వీరిని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించలేదు. అయినా కొన్ని కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లు విధులకు హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాలలో 53 మంది, కుమురంభీంలో 39, నిర్మల్‌లో 43, ఆదిలాబాద్‌లో 50 మంది గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగిస్తున్నారు.

నియామకంపై గందరగోళం..?

గెస్ట్ లెక్చరర్ల పునర్నియామకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2023–24 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గంట ప్రాతిపదికన పనిచేయడానికి మంగళవారం గెస్ట్ ఫ్యాకల్టీ ఎంపిక కోసం కళాశాలల ప్రిన్సిపాల్‌లకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. విద్యార్థుల సంఖ్య, సబ్జెక్టు వారీగా పనిభారం ఉన్న చోట మంజూరు చేయబడిన ఖాళీలకు సంబంధించిన సమాచారాన్ని అందజేయాలని సూచించారు. పాత వారిని నియమించకుండా కొత్త నోటిఫికేషన్‌కు కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ నవీన్‌మిట్టల్ జీవో జారీ చేయడంతో గందరగోళం నెలకొంది. గతేడాది వరకు జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తించిన గెస్ట్ లెక్చరర్లను పునర్నియమించిన తర్వాత మిగతా ఖాళీల్లోనే కొత్తవారితో భర్తీ చేసినట్లు చెబుతున్నారు. జనవరి నుంచి మార్చి వరకు వేతనాలు తొందరగా ఇవ్వాలని కోరుతున్నారు.

పాతవారినే కొనసాగించాలి



ఏడాదికి ఏడు నెలల వేతనంతో బోధన చేస్తున్నాం. వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పనిచేశాం. ముఖ్యమంత్రి కేసీఆర్ 12నెలల వేతనం వచ్చేలా చూస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకుని కొత్త నోటిఫికేషన్ నిలిపివేసి పాత వారినే కొనసాగించేలా జీవోను విడుదల చేయాలని కోరుతున్నాం.

– మహేష్, అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

అవకాశం కల్పించాలి



జూనియర్ కళాశాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుకుంటున్నారు. బోధనకు ఆటంకం లేకుండా ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను పునర్నియమించాలి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి. గత సంవత్సరం కాంట్రాక్టు లెక్చరర్లు రెగ్యులర్‌తో బదిలీపై రావడం వల్ల కొంతమంది ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వారికి కూడా తిరిగి పోస్ట్ ఖాళీగా ఉన్నచోట అవకాశం కల్పించాలి.

– ఈ.సునంద, అతిథి అధ్యాపకురాలు

నేలకూలిన నూరేళ్ల చెట్టు



చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

వేమనపల్లి: మండంలోని నాగారం గ్రామంలో మంగళవారం ఉదయం భారీ వర్షానికి నూరేళ్ల కాలం నాటి చింత చెట్టు నేలకులింది. వేమనపల్లి–బెల్లంపల్లి మండలానికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవడంతో నియోజకవర్గం కేంద్రానికి, కాగజ్‌నగర్ వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. త్రీఫేజ్ విద్యుత్ లైన్ తెగిపోవడంతో పంట పొలాలు, గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఎంపీవో బాపురావు సూచన మేరకు స్థానిక సర్పంచ్ గ్రామస్తులతో చెట్టు తొలగించే ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి నుంచి కటింగ్ మిషన్ తెప్పించి అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు. ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్‌తో మాట్లాడి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించి సరఫరా చేపట్టారు. సాయంత్రం వరకు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

భార్యను వేధించిన భర్తకు జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ స్పెషల్ జేఎఫ్‌సీఎం పీసీఆర్ కోర్టు మేజిస్ట్రేట్ దుర్గారాణి మంగళవారం తీర్పు నిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని ఖిల్లాకు చెందిన హుస్సేన్ బిన్ పరాస్‌కు సంజయ్‌నగర్‌కు చెందిన యువతితో వివాహమైంది. వరకట్న వేధింపులతోపాటు మద్యం తాగి గొడవకు దిగేవాడు. మానసికంగా, శారీరకంగా వేధించడంతో 2014 ఆగస్టు 31న బాధితురాలు ఆదిలాబాద్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై పద్మ కేసు నమోదు చేశారు. ఏపీపీ నవీన్‌కుమార్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో తీర్పునిచ్చినట్లు వివరించారు.

ప్రాణహితకు వరద ఉధృతి



ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద, భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వేమనపల్లి పుష్కరఘాట్ పై నుంచి వరద పోటెత్తుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేన్లలోకి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగువన మేడిగడ్డ వద్ద ఎక్కువ మొత్తంలో గేట్లు తెరవకపోవడంతో వరద లోతట్టు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ప్రాణహిత నదిపై నుంచి మహారాష్ట్ర–తెలంగాణకు నాటుపడవల రాకపోకలు నిలిచిపోయాయి.

– వేమనపల్లి